ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఏలూరులో 112వ రోజు పాదయాత్ర
- ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తెలిపారు. 112వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం తంగెళ్లమూడి 48వ డివిజన్ 3వ సచివాలయ పరిధిలో నాని నిర్వహించారు. పాదయాత్రగా ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమయ్యారన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా ?, అవ్వాతాతలకు సక్రమంగా పింఛన్ అందుతుందా? అని ఆరా తీశారు. సాంకేతిక లోపంతో పథకానికి దూరమైతే వాటిని సరిచేసి అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను నాని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి పేదవానికీ సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఏలూరులో 30 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. ఏలూరులోని అర్హులందరికీ ఇళ్లు కట్టించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుండగా డ్వాక్రా మహిళలకు ప్రత్యేకంగా బ్యాంకుల ద్వారా మరో రూ.35 వేల రుణంగా ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేలా అధికారులు శ్రద్ధ వహించాలని ఆదేశించారు. తొలుత కార్పొరేటర్ సున్నా స్వాతి శ్రీదేవి, పార్టీ నాయకులు సున్నా కిషోర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్లు, పార్టీ నేతలు ఉన్నారు.



తంగెళ్లమూడిలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

క్లుప్తంగా

యాసిడ్ కేసులో సత్వర న్యాయం అభినందనీయం



ఎస్పీ మేరీ ప్రశాంతికి మొక్క అందిస్తున్న అజయ్ బాబు

ఏలూరు (టూటౌన్): ఏలూరు యాసిడ్ దాడి కేసులో ముద్దాయిలకు జీవిత ఖైదు విధించే విషయంలో విశేష కృషిచేసిన ఎస్పీ మేరీ ప్రశాంతిని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు మేతర అజయ్ బాబు అభినందించారు. కేవలం 117 రోజుల్లో ముద్దాయిలకు శిక్ష పడే విధంగా పర్యవేక్షణ చేసిన ఎస్పీతో పాటు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

ఏలూరు రూరల్ ఎస్సైగా రాజారెడ్డి



ఎస్సై రాజారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ఎస్సైగా రాజారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. 2014 ఎస్సై బ్యాచ్‌కు చెందిన రాజారెడ్డి కృష్ణా జిల్లా నాగాయలంక పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ తీసుకున్నారు. అనంతరం కైకలూరు టౌన్, ముసునూరు, ఆకివీడు పోలీస్ స్టేషన్లల్లో పనిచేశారు. భీమవరం స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు వన్‌టౌన్ సర్కిల్‌లోని రూరల్ స్టేషన్‌కు ఎస్సైగా వచ్చారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. బాధితులు నేరుగా తమను కలిసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

లలిత శర్మకు పురస్కారం



లలిత శర్మ

ఏలూరు (ఆర్ఆర్ పేట): సంగీత కళకు విశిష్ట సేవలు అందిస్తోన్న నగరానికి చెందిన సంగీత కళాకారిణిగా గుడిపాటి లలిత శర్మను కేవీ సత్యనారాయణ సంగీత ప్రతిభ పురస్కారం–2023కు ఎంపిక చేశామని కేవీఎస్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 15న కేవీఎస్ ట్రస్ట్, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్ఆర్‌పేట మార్కండేయ వేద పాఠశాలలో సాయంత్రం జరిగే సంగీత సభలో అందించనున్నట్టు పేర్కొన్నారు. అవార్డు జ్ఞాపిక, రూ.5116, శాలువతో సత్కరిస్తామని తెలిపారు.

నేడు ఏలూరు ఆటోనగర్ కార్యవర్గ ఎన్నికలు



మాట్లాడుతున్న ఎన్నికల కమిటీ సభ్యుడు రంగారావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు ఆటో నగర్ ఎన్నికలు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించనున్నట్టు ఎన్నికల కమిటీ సభ్యుడు మల్లవరపు రంగారావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రతి సభ్యుడూ ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును రహస్య బ్యాలెట్ ద్వారా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఈ నెల 7, 8 తేదీల్లో నామినేషన్లు స్వీకరించామని, 9న నామినేషన్ల స్క్రూటినీ చేశామని చెప్పారు. 10న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా వెల్లడించామన్నారు. మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం ఈ ఎన్నికల్లో అల్లర్లు సృష్టించి సంఘం పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తుండడం తగదన్నారు. సమావేశంలో ఎన్నికల సహాయ సిబ్బంది ఉప్పులూరి హేమశంకర్, శాయన అఖిలాష్ కుమార్, అసోసియేషన్ సభ్యులు పల్ల అప్పారావు, షేక్ షాన్ వాజ్, సయ్యద్ అబ్దుల్ కరీం, మరకాల మురళి, మంతెన వెంకటేశ్వరరావు, ఆజాద్ చంద్రశేఖర్, మావూరి శ్రీనివాసరావు, బొడ్డు సురేష్, కాదులూరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డాగ్స్ రేసింగ్‌లో సత్తా చాటిన రాకీ



ఏలూరు టౌన్: రాష్ట్ర పోలీస్ విభాగ శునకాల 21వ బ్యాచ్ పాసింగ్‌ఔట్ పరేడ్ మంగళగిరిలో ఈ నెల 9న నిర్వహించారు. పోలీస్ డాగ్స్‌కు రేసింగ్ కాంపిటీషన్ నిర్వహించగా ఏలూరు జిల్లాకు చెందిన పోలీస్ శునకం రాకీ సత్తా చాటింది. ఎక్స్‌ప్లోజివ్స్ విభాగంలో హ్యాండ్లర్ హెడ్‌కానిస్టేబుల్ కె.రాఘవరావు శునకం రాకీ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఏలూరు పోలీస్ ప్రధాన కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ మేరీప్రశాంతికి పోలీస్ డాగ్స్ గౌరవ వందనం చేశాయి. శునకాల హ్యాండ్లర్ ఎ.రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ శునకాలకు శిక్షణ ఇస్తున్నారు. ఏలూరు జిల్లాలో యోద పోలీస్ డాగ్ ట్రేసింగ్ కేటగిరిలో పనిచేస్తుండగా హ్యాండ్లర్‌గా కానిస్టేబుల్ పీవీ ప్రసాద్, మరో పోలీస్ శునకం టైగర్ ఎక్స్‌ప్లోజర్ విభాగంలో శిక్షణ పొందుతుండగా రాంబాబు హ్యాండ్లర్‌గా వ్యవహరిస్తున్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్



శ్రీపర్రులో మెడికల్ రిపోర్టులు అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఏలూరు మండలం శ్రీపర్రులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటుచేశారు. 387 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులతో పాటు మెడికల్ రిపోర్టులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి ఉన్నత స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. పేదలను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే సీఎం జగన్ లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్ కొనియాడారు. సీఎం జగన్ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని వడ్డికుల కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు అన్నారు. ఎంపీడీఓ బి.ప్రణవి పరివేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి, సైదు వజ్రం, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సచివాలయం, క్లినిక్‌ల నిర్మాణం



పెదయాగనమిల్లిలో సచివాలయ భవన పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో కొల్లేరు గ్రామాల్లో సచివాలయ, వైఎస్సార్ క్లినిక్ భవనాల నిర్మాణం చురుగ్గా సాగుతోందని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు చెప్పారు. గురువారం ఏలూరు మండలం పెదయాగనమిల్లిలో రూ.55 లక్షలతో చేపట్టిన సచివాలయం, వైఎస్సార్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రూ.35 లక్షలతో సచివాలయం, రూ.20 లక్షలతో క్లినిక్ రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ వహించారని తెలిపారు. అభివృద్ధి పనుల్లో కొల్లేరు పెద్దలు, ప్రజలను సైతం భాగస్వాములను చేస్తున్నారని వివరించారు. త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా పూర్తి చేసిన సచివాలయాలు, క్లినిక్‌లు, ఆర్‌బీకే కేంద్రాలను వరుస క్రమంలో ప్రారంభిస్తారని వివరించారు. ఇప్పటికే పెద్ద ఎత్తున సీసీరోడ్లు అభివృద్ధి చేశామన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి సత్యకుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల, తిరుపతి దేవస్థానాలకు భక్తుల ద్వారా లభించే వార్షిక ఆదాయంలో ఒక శాతం ఆదాయాన్ని తిరుపతి నగర అభివృద్ధికి కేటాయించాలన్న టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్య రవి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీటీడీ తిరుపతి నగరపాలక సంస్థకు అనేక రూపాల్లో పన్నులు చెల్లిస్తోందన్నారు. ముండూరు యజ్ఞవల్క రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ ఆలయాలు ఉంటేనే సమజాంలో శాంతి నెలకొంటుందన్నారు. అందుకే పూర్వీకులు ఆలయాల అభివృద్ధికి భూములు, నగదు భారీగా విరాళంగా సమర్పించేవారని గుర్తుచేశారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాకి సురేష్ కుమార్, కార్యదర్శి గెడ్డం నాగరాజు, కోశాధికారి గ్రంధి ప్రభాకర రావు, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ పరసా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీఐసీ వ్యవస్థాపకుడు దేవదాసి

ఏలూరు (టూటౌన్): బీసీ సీగా గుర్తింపు పొందిన క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలని సీఐసీ వ్యవస్థాపకుడు రెవ.వరదాన్ దేవదాసి కోరారు. స్థానిక 44వ డివిజన్ గన్‌బజారులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి 1947లో స్వాతంత్ర్య వచ్చినా బీసీ సీగా ఉన్న క్రైస్తవులకు నేటికీ స్వాతంత్ర్యం రాలేదని, వివక్షకు గురవుతున్నారని వివరించారు. ఓటు బ్యాంకుగానే మిగిలిపోతున్నామని తెలిపారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం స్వచ్ఛందంగా ముందుకొచ్చిన విశ్వాసులకు బీసీ సీ సర్టిఫికేట్ ఇవ్వాలని, దీనిపై తహసీల్దార్లకు గైడ్ లైన్స్ ఇవ్వాలని కోరారు. క్రైస్తవులకు శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏలూరు సీఐసీ బోర్డు సభ్యులు వై.గ్రేస్ జాన్, ఎం.సీమోను రాజు, కె.షేము, యోహాను, వై.విజయ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా నిలవడం అభినందనీయం



మాట్లాడుతున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మణిపూర్ అల్లర్లలో బాధిత క్రైస్తవులకు అండగా నిలవడానికి ముందుకొచ్చిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని తంగెళ్లమూడి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం తంగెళ్లమూడిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఉన్న బాధిత క్రైస్తవులను గత నెల 11 నుంచి 20వ తేదీ వరకు కలిసి వారికి ధైర్యం చెప్పి వారికి నగదు, వస్త్ర, నిత్యావసరాల రూపంలో తమ ఫెలోషిప్ ప్రతినిధులు అందజేశారని చెప్పారు. వారికి సహకరించిన వివిధ సంఘాల సభ్యులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మణిపూర్ వెళ్లిన వారిలో తంగెళ్లమూడి పాస్టర్స్‌ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు ఎంఎం రవికుమార్, అధ్యక్షుడు బి.యోహాను, కోశాధికారి కె.మార్కు రాజు, జె.ఆదామ్ సురేష్, బిషప్ శ్యామ్ పాలీనా, బిషప్ ఎస్ ప్రభాస్ ఉన్నారని, వారంతా మణిపూర్‌లోని మోత్‌బంగ్ ప్రాంతంలో అనాధ పిల్లల ఆశ్రమ సహాయార్థం డాక్టర్ మేతికి రూ.లక్ష సాయం అందజేశారని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్ ఫ్రీ సూపర్ హీరోలుగా ఉండాలని నవజీవన్ నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు సూచించారు. బాలభవన్ ఆధ్వర్యంలో ఏలూరు రామచంద్రరావుపేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకు రావచ్చని, ఈ చికిత్స అందించేందుకు నవజీవన్ బాల భవన్ సంస్థ నూజివీడులో బోస్కో డీఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసిందని, వివరాలకు ఉచితంగా ఫోన్ నెంబర్ 9490492020లో సంప్రదించవచ్చని తెలిపారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): బీసీల రిజర్వేషన్లకు సంబంధించి అనంతరామన్, మురళీధర్‌రావు కమిషన్స్ సిఫార్సులు అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. స్థానిక పవరుపేటలోని కొప్పువెలమ సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీపీ మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన మహిళా బిల్లులో ఓబీసీ మహిళ వాటా తేల్చాలన్నారు. సమగ్ర కులగణన చేపట్టి దేశంలో బీసీల శాతాన్ని తెలపాలని కోరారు. సమావేశంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చాటపర్రు గ్రంథాలయంలో పోటీలు

ఏలూరు రూరల్: దసర సందర్భంగా ఈ నెల 14 నుంచి 24 వరకు ఏలూరు మండలం చాటపర్రు గ్రామ గ్రంథాలయంలో బాలబాలికలకు పోటీలు చేపట్టనున్నామని గ్రంథాలయ నిర్వాహకురాలు కె.వాసుకి ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు గ్రంథాలయానికి హాజరైన పిల్లలకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కథలు వినడం, పుస్తకాలు చదవడం, పుస్తకాల సమీక్ష, కథల చెప్పడంతో పాటు స్పోకెన్ ఇంగ్లిషు, పెయింటింగ్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహిస్తామని వివరించారు.

జూదరుల అరెస్ట్

పెదవేగి : పేకాట శిబిరంపై దాడి చేసిన ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారంతో దాడి చేసి ఆరుగురి వ్యక్తులు నుంచి రూ.6,450, ఐదు మోటారు సైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

మిస్టరీగా వరప్రసాద మూర్తిరాజు మృతి



ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన ఘంటసాల వరప్రసాదమూర్తిరాజు (52) మృతి మిస్టరీగా మారింది. శ్రీరామ్‌నగర్‌లో ఒంటరిగా నివసిస్తున్న వరప్రసాదమూర్తిరాజు ఒంటిపై గాయాలు ఉండటం, చెయ్యి, కంటిపై కమిలిన గాయాలు, రెండు కళ్ల నుంచి రక్తం కారి ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాకినాడలో బీసీ వెల్ఫేర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తోన్న ఆయన బుధవారం రాత్రి ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. గురువారం ఉదయం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. వరప్రసాదమూర్తిరాజు భార్య వెంకటలక్ష్మి జనసేన పార్టీ దెందులూరు నియోజకవర్గం నాయకురాలుగా ఉన్నారు. వీరిద్దరూ కొంతకాలంగా దూరంగా ఉంటున్నట్టు చెబుతున్నారు. వెంకటలక్ష్మి, బంధువులు ఎవరూ వరప్రసాదమూర్తిరాజు మృతిపై ఫిర్యాదు చేయలేదని పోలీసులు చెబుతున్నారు. వరప్రసాదమూర్తిరాజుతో కలిసి పలువురు మద్యం సేవిస్తుంటారని, మృతి చెందిన సమయంలో ఎవరు ఉన్నారనే అంశంపై ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



సదస్సులో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): పంటల గిట్టుబాటు ధరల కోసం ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పిలుపు నిచ్చారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వ్యవసాయ సంక్షోభం – గిట్టుబాటు ధరలు – ధాన్యం కొనుగోలు సమస్యలపై గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా అధ్యక్షతన ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి సదస్సులో పలు తీర్మానాలను ఆమోదించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.18 వేలు కనీస ధర నిర్ణయించాలని కోరారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని, కొబ్బరి వెయ్యి కాయలకు రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు కల్పించాలన్నారు. ఈ మద్దతు ధరలు అమలుకు చట్టం తేవాలని కోరారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. సదస్సులో రైతు సంఘం నాయకులు కె.జలపాలు, కట్టా భాస్కరరావు, జి.ప్రసాదరావు, కె.అప్పారావు, వి.శ్రీరామచంద్రమూర్తి, గుడిబండి రమేష్ రెడ్డి, సున్నా వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పెదపాడులో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదపాడు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడులోని సత్యనారాయణపురం, ఇందిరా కాలనీలో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్యనారాయణపురంలో ఎన్నో ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు దూరంగా ఉండటంతోపాటు వైర్లు సాగిపోయి క్రిందకు వేలాడుతున్నాయని స్థానికులు చెప్పడంతో ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఇందిరా కాలనీలో సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండు పూటలా తాగునీరు అందించాలని, ఇళ్ల నిర్మాణ బిల్లులు వేయించాలని, పలు సమస్యలు గ్రామాల్లో వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొట్టాపు నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, గోగుంట సొసైటీ అధ్యక్షుడు గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, వైఎస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి, ఎంపీటీసీ కర్రె మరియమ్మ, కొత్తూరు విమలారావు, చేపేని కృష్ణ రెళ్ల రమణ, ఎంపీడీఓ ఎస్ నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	26
డి.తిరుమల ఏలూరు బీహెచ్‌ఈఎల్	22.15	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	19

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	14
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	16
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	38
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	05–07
బెండకాయలు	20	కంద	40
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	38
కాకర కాయలు	30	కీరా దోస	48
బీరకాయలు	26	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	20	అల్లం	130
క్యారెట్	38–44	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	34	తోటకూర	12
గోరుచిక్కుడు	32	గోంగూర	06
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	36–46
		నిమ్మకాయలు (డజను)	--